# ఇంటి పేరు ఒక్కటే!

రైలు వేగాన్ని పుంజుకుంది. కడప సరిహద్దులు వెనక్కి పోతున్నాయి.

నేను సర్దుకు కూర్చుని, చుట్టూ కలయ జూశాను. నా పక్కగా - వో యువకుడు. ఏదో ఇంగ్లీషు పత్రిక చదువుతున్నాడు. అతని పక్కగా, విండోసీట్లో అతని భార్య.

నాకు ఎదురుగా—నల్లగా, లావుగా, గుబురుమీసాల ఆసామీ. పంచె, లాల్చీ, రైతులా అనిపిస్తున్నాడు.

అతని పక్కగా—అతి చిన్న బ్రీఫ్‌కేస్‌ని ఒళ్లో రెండు కాళ్ళమీదా పెట్టుకుని, గాలికోసం చాలా ఆరాటపడుతూ, ఫ్యాన్‌కోసం, బయటినుంచీ వచ్చే గాలికోసం ఎదురు చూస్తున్నవాడిలా, చొక్కాని సవరించుకుంటూ, కాలర్ పైకి లాక్కుని—ఉసురుసురంటున్న వో నడివయస్కుడు.

అతనికి పక్కగా విండోసీట్లో—అతని భార్య. నుదుట పెద్ద కుంకుమబొట్టు, నేతచీర, పాలిస్టర్ జాకెట్‌లలో

చూడముచ్చటగా, శుభ్రంగా వుంది. వంటిచాయ వో వన్నె తరిగినా, పచ్చని మనిషే.

ఇక, నాకు ఎడమచేతివైపు సింగిల్ సీట్లలో—

ఒకతనేమో బీడీ కాలుస్తూ కిటికీలోనుంచీ ప్రకృతిని చూస్తున్నాడు—తల ఈవైపు తిప్పకుండా.

అతని ఎదుటి సీట్లో మనిషి నిజానికి రెండుసీట్ల మనిషి అంటే బాగుంటుంది. అతను మాసిన గడ్డంతో, వెలిసిన బట్టల్లో, పాలిపోయిన ముఖంతో—భేషజం మినహా సర్వమూ కోల్పోయిన రాజరాజులా—వున్నాడు. వయస్సు నలభై అయిదు పైమాటే. ఎడమ చేతిలో శనక్కాయ పప్పుని – ఒక్కొక్కటే—కుడిచేత్తో నోట్లో వేసుకుంటూ నములుతున్నాడు.

ఈ ఏడుగురు ప్రయాణీకులూ అప్పటికప్పుడే నన్ను ఛూసేసి, "సరే కూర్చో" అన్నట్టు మొహాలు పెట్టేసి తమ పనుల్లో తాము మునిగిపోవడానికి సిద్ధమౌతున్నారు.

నా ఎదురుగా కూర్చున్న ఆసామీ నోరు విప్పాడు. "ఈ దినం నా తమ్ముడు ఊరినుంచీ వొచ్చినాడు. ఊరి తగరార్లల్లో సిక్కుకున్నాడంట. కరువు సంగతులింక జెప్పేదేం వున్నాది. రూకలు గావాలంటే, ఎవసాయఁవా తూగించలేడు. పట్నం వొచ్చెయ్యరా అంటే ఇనుకోడు."

ఆయన పక్కన కూర్చున్న నడివయస్కుడు వింటూ ఊఁ కొడుతున్నాడు.

"సెప్పిన మాటలు పనికిరావు. అందుకే, అనుభవాల పుట్టగా అప్పుల్లో మునిగి తేలతా వుండినాడు." ఒక క్షణం ఆగి, "వానితో ఏగేది కట్టంగా వుంది. పిలకాయలూ, వాని భార్యా కట్టాల్లో పడినారు. అన్నీ తెలిసి అడవిలో పడేవోణ్ణి ఏం చేస్తాం మనం".

"ఎంకటన్న తత్వమే అంత. మొండోడు. నాకు తెలియదా ఏందబ్బా" అని శ్రుతి కలిపాడు పక్కాయన.

"సూడు నారాయణా. సినీ వొద్దురా అని పోరు బెట్టినాను. ఇనుకోలేదు. ఏఁవైనాది ? కాయ రాలేదు."

"అయినా, వున్న వూరూ, సేద్యం వదులుకుని పట్నం రావాలంటే అయ్యే పనేనా ? "

"మరి. నా ఇబ్బందులు నాకుండినై. కడాకు నన్నొదులుమంటే ఇనుకోవాల" కొంచెం చిరాగ్గా అన్నాడు.

ఉన్నట్టుండి, నా ఎడమవైపు సింగిల్‌సీట్లో బీడీ కాలుస్తూవున్న వ్యక్తి, బీడీ బయటికి విసిరేసి ఇటు తిరిగాడు.

"ఏంది దొరా— మీకే మెరిక. ఎవుసఁవంటే రూపాయిలు బొక్కినట్టే నయ్యింది. ఊఁకెనే అయిపోతాది. ఇత్తనాలు, ఎరువులు, మందులు, కరెంటు బిల్లులు, ఎడ్ల తిండి. అండ్ల పండితే సరె. ఎండితే—నీ తమ్ముని కత".

అందరి దృష్టి అతనిమీదికి మళ్ళింది.

"కొంగ్రడను మించిందేఁవుంది—దేవుడన్నా. మన తాత ముత్తాతలదాకా అందరూ మన్నునే నమ్ముకున్నరు. మనం దున్నింది, పంటలు పండియ్యింది జనం వేం దింటరు ? అన్నాడు మా అయ్య. ఎవుసంలోకి దిగితిని".

దేవుడన్న పెదవి విరిచి, నిరాశగా, నిర్లిప్తంగా చెప్పటం సాగించాడు.

"కోటి విద్దెలు నేర్చినా కొంగ్రడను మించవు బిడ్డా — అంటిని. సూడిగ్రని. నా కొడుకు దేశంగాని దేశంల కొచ్చి బడె. ఏమో రంది పడె. అడ్డ మాటలని ; నన్ను పోనియ్యగ్రనే—నా తంటలెవ్వో నేనే బడుత—అని పోయిండు. దిక్కులేని పచ్చొలె బోయేనా ? ఆశలకేంది— మత్తుగుంటయ్. ఈ దినం — కొడుకు—రిచ్చాల్లాగి, దినం కూలికెల్లి—సూడుగ్రని—ఎంత ఇశారం గున్నడు ? సదూకున్నడే మల్లా. బిఁయ్యే".

ఈ నాలుగు మాటలూ అనేసి, ఆలోచనలోకి జారుకున్నాడు, దేవుడన్న.

నిశ్శబ్దం పరచుకుంది.

దేవుడన్న మళ్ళీ బీడీ తీసి వెలిగించుకుని, బయటికి చూడసాగేడు.

మిగిలిన వాళ్ళంతా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఎవ్వరూ పెదవివిప్పి మాట్లాడలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయారు. చూపులు దశదిశలా తిరుగుతున్నై.

రైలు రొదచేస్తూ సాగిపోతోంది. నుదుట పట్టిన చెమటని రుమాలుతో తుడుచుకుని, కొంచెం కుడివైపుకు జరిగి కూర్చున్నాను.

నా పక్కన యువకుడు ఇబ్బందిగా జరిగేడు. అతని భార్య కూడా తల త్రిప్పి అయిష్టంగా సర్దుకుంది.

గుబురు మీసాల ఆసామీ మళ్ళీ ఏదో చెప్పడం ప్రారంభించేడు. నడివయస్కుడు వింటున్నాడు—తల త్రిప్పుతూ; ఉండుండి వోసారి చేతుల్లో బ్రీఫ్‌కేస్‌ని అటూ ఇటూ, పైకీ క్రిందికి మారుస్తూ. ఇప్పుడు ఆ ఆసామీ చెప్పేది, వివరంగా వినిపించడంలేదు. పక్క కాబిన్‌లో మాటలూ, శబ్దాలూ హెచ్చినై.

నేను మేగజైన్ తీసుకున్నాను.

రెండు మూడు పేజీలు తిరగేశాను. నా పక్కన యువకుడు సన్నగా భార్యతో అంటున్నాడు.

"నేనింతగా ఎందుకు చెప్తున్నానో ఆలోచించు రాధా".

ఆమె ఏఁవీ మాట్లాడలేదు.

"తగిన అర్హతా వుండి, అవకాశమూ వస్తే—ఇట్టా మీనమేషాలు లెక్కపెట్టడం ఏఁమీ బాగాలేదు".

ఆమె మౌనాన్ని పాటిస్తూనే వుంది.

"నిజానికి మనం ఎంతో అదృష్టవంతులం కాబట్టి హైదరాబాద్‌లోనే పోస్టింగ్ వచ్చింది. ఇంతకంటే ఏం కావాలి ? " అని ఒక్క క్షణం చుట్టూ చూసి, "ఏమంటావ్ ? " అని ఆమెకేసి గుచ్చిగుచ్చి చూస్తూ అడుగుతున్నాడు.

ఆమె ఇబ్బందిగా మొహం పెట్టింది. అందులోనూ నేను వాళ్ల మాటలు వింటున్నానని ఆమె గమనించింది. తలవంచుకుని, నేల చూపులు చూస్తూ – "చెప్తిని గదా— నా అభిప్రాయం ? " అంది.

"అదే–ఆ అభిప్రాయమే మార్చుకోమంటున్నది"–యువకుడి స్వరంలో చిరాకు.

కొద్ది క్షణాలు ఇద్దరూ మౌనంగా వున్నారు.

పుస్తకంలో నుంచీ దృష్టి మరల్చి, టైమ్ చూసుకున్నాను. ఎనిమిదిన్నర. బయటికి చూశాను. పిండారబోసినట్లు వెన్నెల కాస్తోంది. కొండలూ, గుట్టలూ—వెన్నముద్దల్లా, సరిహద్దుల్ని కాపలా కాస్తున్న ఐరావతాల్లావున్నై. ఊళ్ల పొలిమేరలు దాటిపోతున్నై.

యువకుడు రాధ బుజంమీదగా చెయ్యి—ఆ వైపు కిటికీ మీదకి వేశాడు. ఆమె పమిట సర్దుకుని క్రీగంట భర్తని చూసి, చూపులు వెలుపలికి మరల్చుకుంది.

" మాట్లాడవేం " అన్నాడు. ఈసారి స్వరంలో మార్దవం వచ్చింది.

" చెప్పాను కదండీ. మా అక్కని ఉద్యోగంలో పెట్టి మా అమ్మా నాన్నా నానా అవస్థలు పడ్డారు. అక్కా బావా వుద్యోగాలు. పెళ్లయిన ఏడాదికే వో పిల్ల. ఆ పిల్లని సాకేందుకు ఎన్నెన్ని బాధలు పడాల్సొచ్చిందో. దానికి తోడు, ఉద్యోగమంటే రోజంతా ఉరుకులూ పరుగులూ — ఏం వో ఎన్ని విధాల ఆలోచించినా — సుఖం వేమీ కనిపించడం లేదు. "

" నువ్ చెప్పేవన్నీ వొప్పుకుంటాను. కానీ, మన ఆర్థిక పరిస్థితులూ కాస్త ఆలోచించు. మా చెల్లెలు పెళ్ళి చేయాలా ? శీను ఇంజనీరింగ్ అవ్వాలా ? ఏదో వేణ్ణీళ్లకి చన్నీళ్లుగా...." కన్విన్సింగ్‌గా చెప్తున్నాడు.

రాధ తలయెత్తలేదు. ఊం కొట్టలేదు. మౌనం అర్థాంగీకారమనుకున్నాడో ఏమో, ఆ యువకుడూ సంభాషణని పొడిగించలేదు.

నిముషాలు గడుస్తున్నై. రైలు పోతోంది. సీటు క్రింది బుట్టని బయటికి లాగి, ప్లాస్టిక్ కవర్ తీసింది — నాకు ఎదురు బల్లమీద కూర్చున్న మధ్యవయస్కుడి భార్య.

తిండి కార్యక్రమం మొదలైంది. రాధ కూడా బ్యాగ్‌లోనుంచీ చపాతీలూ, పులిహోరా తీసి, న్యూస్‌పేపర్ భర్త చేతికిచ్చి దాన్లో పదార్థాల పంపకాలు మొదలెట్టింది.

నేను లేచి కంపార్ట్‌మెంట్‌లో డోర్ కేసి వచ్చేశాను.

రైలు గుత్తిలో ఆగింది. అరటిపండ్లు కొనుక్కొని తిని, టీ తాగి మళ్లీ బోగీలోకి వచ్చాను.

అందరూ భోజనాలు ముగించారు.

దేవుడన్న పై బెర్తుమీదికి చేరుకున్నాడు. క్రింది బెర్తుమీద అప్పటికే నిద్రలోకి జారాడు, రెండు సీట్ల స్థూలకాయుడు.

రైలు మళ్లీ బయల్దేరింది.

"మనం కూడా పడుకుందామండీ" యువకుడు నాతో అన్నాడు. నేను లేచి మధ్య బెర్త్‌ని వంచి, నెమ్మదిగా పై బెర్త్‌కి చేరుకున్నాను. రాధ క్రింది బెర్త్‌నీ, అతను మధ్య బెర్త్‌నీ ఆక్రమించారు. యువకుడు పెద్దలైట్ తీసేసి, బెడ్‌లైట్ ఆన్ చేశాడు.

ఎదురు బెంచీమీద కూర్చున్న ముగ్గుర్నీ చూస్తూ, ఈ వైపుకి తిరిగి పడుకున్నాన్నేను.

"నువ్వూ పడుకుంటావేంవమ్మా, శారదా ?" మీసాల పెద్దాయన అడిగేడు.

"నిద్రరావటల్లేదు. కూర్చోండి ఫర్వాలేదు" అంది శారద. పమిటచెంగుని భుజం చుట్టూరా కప్పుకుని. విండో అద్దాన్ని కిందికి దించింది. ఆమె స్వరం కమ్మని సంగీతంలా చెవిని పడింది. అప్పటికే ఆమె పొందిక తనానికీ, గాంభీర్యానికీ, ఆమెపట్ల వొక గౌరవభావాన్ని అనుభవిస్తున్న నాకు—ఆమె కంఠంలోని మాధుర్యం—కమ్మతెమ్మెరలా సోకింది. మనస్సు ఆనందభైరవి రాగాన్ని ఆలపించుకోసాగింది.

హఠాత్తుగా అమ్మ గుర్తుకొచ్చింది. పంచదార కలిపిన పాలు తాగిస్తున్న స్ఫురణ కలిగింది. బెర్త్‌మీద నుంచీ వంగి, శారద ఫాలభాగంమీదుగా, కిటికీ అద్దంగుండా బయటికి చూస్తే—ఆకాశం, వెన్నెల, చల్లదనం—ఏవేవో అర్ధరిక్తాభావనలు ముప్పిరిగొన్నై. కళ్ళుమూసుకున్నాను.

కునుకు....ఏవేవో కలలు....అమ్మ చెల్లెలు వరాల్ని నా చేతుల్లో పెడుతూ....కళ్ళల్లో నీళ్లతో....ఆ రాత్రే పోయింది ఆమె.

గుండె దడదడలాడుతూండగా లేచాను. ఎదురుగా వాళ్ళు ముగ్గురూ మాట్లాడుకుంటున్నారు. అటూ, ఇటూ మసలి—మళ్ళీ ఇటే తిరిగి పడుకున్నాను. శారద చెప్తోంది.

"ఈ మాఘంతో తప్పకుండా మా అన్నపూర్ణకి పెళ్ళిచెయ్యాలి—బాబాయ్‌గారూ. ఎక్కడన్నా సంబంధా

లుంటే చూసిపెట్టండి. మీకు తెలుసు గదా—మా సమస్య. ఎంత ప్రయత్నించినా దానికి చదువు వొంటబట్టలేదు. చదువూ, ఉద్యోగమూలేని పిల్లకి పెళ్ళంటే ఎంత కష్టమో మీకు తెలియనిది కాదు.'' పగిలిన గొంతులోంచీ వస్తున్నై మాటలు.

శారదకు—కూతురా? పెళ్ళీడు పిల్లా? కళ్ళముందు ఏవేవో వలయాలు తిరుగుతున్నై. ఏడ్చి ఏడ్చి అలసిన పిల్ల గుర్తుకొస్తోంది. తల గిరగిరా తిరుగుతోంది. కళ్ళు మూసుకున్నాను.

అరుపులు, కేకలు, స్టేషన్ హడావిడికి అదాటున లేచాను.

రైలు గుంటకల్ స్టేషన్‌లో ఆగివుంది. బెర్త్‌మీంచీ కిందికి దిగి సూట్‌కేస్ తీసుకున్నాను.

అప్రయత్నంగా నా సహ ప్రయాణీకుల్ని చూశాను. అందరూ నిద్రలో వున్నారు.

దేవుడన్న—మీసాల ఆసామీ—వీళ్ళకి వీళ్ళవాళ్ళకి రైతు సమస్యలూ, నిరుద్యోగ బాధలూ!

రాధమ్మ—యువకుడు—ఉద్యోగ వ్యథలు!

నడివయస్కుడు—శారద—చదువుకోని ఆడపిల్ల పెళ్ళి సమస్య!

క్షణంలో సగంసేపు గుండె గుబగుబలాడింది.

నా ముందున్న — కొండచిలువ — వరకట్నం. వరాలుని తన కొడుక్కి చేసుకోవడానికి మామయ్య విధించిన షరతు—యాభై వేల కట్నం లేదా నేను ఆయన మూగపిల్లని చేసుకోవడం.

తూలి పడబోయి నిలదొక్కుకున్నాను.

భారంగా అడుగులు వేస్తూ రైలు దిగాను.

ప్లాట్‌ఫారమ్ వెలుగుల్ని వెలారుస్తోంది. నడక సాగించాను. ఈ వయస్సులో నే పెళ్ళాడుకొచ్చిన పిల్ల వున్న—శారదమ్మ మొహం కళ్ళముందు కదలాడు తోంది.

అమ్మ గుర్తుకొచ్చింది. మాఁవయ్య గుర్తుకొచ్చాడు. చాలామంది బంధువులు గుర్తుకొచ్చారు. స్కూల్లో, కాలేజీలో, యూనివర్శిటీలో ఎంతోమంది నాకు సన్నిహిత మిత్రులు గుర్తుకొచ్చారు.

ఈ దినం తోటి ప్రయాణీకుల రూపాలూ మళ్ళీ కళ్ళల్లో మెదిలినై.

అవును. వీళ్ళందరివీ వేరు వేరు పేర్లైనా—అందరి ఇంటిపేరూ ఒక్కటే! అవును, వారందరికీ ఒకటే ఇంటిపేరు.

అది—మధ్యతరగతి వారు !!!